# తీయని జ్ఞాపకం

- లత

"సౌమ్య చక్కని పేరు" - అనుకోకుండా ఉండలేకపోయాను. ఆమె రూపానికి తగ్గ పేరు కూడా. ఆమెని మూడు నెలల క్రితం నా ఫ్రెండ్ పెళ్ళిలో చూశాను. అందరూ ఏవేవో పట్టు చీరలు కట్టుకుని హడావుడిగా తిరుగుతున్న సమయంలో చాలా సింపుల్‌గా, ఆహ్లాదంగా దర్శన మిచ్చింది సౌమ్య. ఒక్కసారి చూస్తే ఆమెని ఎవ్వరూ మరిచిపోలేనంత అందంగా ఉంది. తిరిగి ఇప్పుడు అమ్మ నా కోసం సెలెక్టు చేసిన పెళ్ళి కూతుళ్ళ ఫొటోల్లో చూసి పేరు తెలుసుకున్నాను.

"ఏం, అభీ! మాట్లాడవు? ఇంకా ఎన్నాళ్ళు వాయిదా వేస్తావ్?" చిరుకోపంగా అంది అమ్మ.

నేను ఆలోచనల్లోంచి బయటపడ్డాను. "నా కైతే ఈ అమ్మాయి బావుం దన్నయ్యా." సౌమ్య ఫొటో చూపిస్తూ అంది మంజు.

"మీ ఇష్టం అమ్మా! సౌమ్యా వాళ్ళ ఇంటికి వెళ్ళి ఖాయం చేసుకుని రండి."

"అ దేమిట్రా పెళ్ళి చూపులకి నువ్వు రావా?" విస్మయంగా అంది అమ్మ.

నేను నవ్వాను.

"ఆ అమ్మాయి నాకు తెలునమ్మా! మీరు వెళ్ళి సెటిల్ చేయండి" అంటూనే హాస్పటల్‌కి వెళ్ళిపోయాను.

ఆ అమ్మాయిని నేను చూడక్కర్లేదు. నిజమే! కానీ న న్నామె చూసుకోవద్దూ? ఈ కాలపు అమ్మాయిలు చాలా ఫాస్టే అని నాకు తెలుసు. అలాగే సౌమ్య నన్ను చూసుకోవటానికి వస్తుం దేమో? నా పెదవులు విచ్చుకున్నాయి. కానీ ఆమె రాలేదు. ఆ తరువాత ఇరవై రోజుల్లోకే ముహూర్తం నిర్ణయించారు.

"కోకిలమ్మ సన్నాయితో నెమలమ్మ మేజువాణీతో" తారాస్థాయిలో వాయిస్తున్నారు బాండ్ వాళ్ళు.

పచ్చని పందిట్లో పీటల మీద కూర్చున్న నేను పురోహితుడు చెప్పిన వన్నీ చేస్తున్నాను. ఎర్రని పట్టు చీరలో దివి నుంచి భువికి దిగి వచ్చే అప్సరసలా వచ్చిన సౌమ్య, వేదమంత్రాల మధ్య నా ఇల్లాలయింది.


"కంగ్రాచ్యులేషన్స్ అభీ! వెరీ బ్యూటిఫుల్ పెయిర్." పెళ్ళికి రాలేకపోయిన అరుణ్ రిసెప్షన్‌లో అభినందిస్తుంటే నవ్వుతూ సౌమ్యకి పరిచయం చేశాను.

రిసెప్షన్ పూర్తయింది. ఫ్రెండ్స్‌ని సాగనంపుతూ గేటు దగ్గర కొస్తున్న నన్ను మంజు పిలిచింది.

"ఏమిటమ్మా?"

"వదిన ఫెయింటైయింది. త్వరగా ఇలా రా!"

నేను వెళ్ళాను. వాడిన మల్లెచెండులా



బెడ్‌మీద పడి ఉంది సౌమ్య.

"రాత్రంతా నిద్ర లేక కాబోలు." ఆందోళనగా అంది అమ్మ.

చిన్నగా నవ్వి. సౌమ్యని టెస్ట్ చేశాను. మరుక్షణం నా కాళ్ళకింద భూమి కదిలింది. ఆమె గర్భవతి. అతి ప్రయత్నం మీద నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ చెప్పాను.

"ఏం లేదమ్మా! నీరసంగా ఉంది. స్పృహ రాగానే వేడిగా పా లివ్వండి."

షవర్ నుంచి చల్లని నీళ్ళు ధారగా పడుతున్నా మెదడు వేడెక్కుతోంది.

మై గాడ్! మై గాడ్! ఆ క్షణమే అందరికీ ఆ నిజం చెప్పేయా లన్న ఆవేశాన్ని ఏమూలో ఉన్న సంస్కారం ఆపుతోంది.

మర్నాటి రాత్రి - మెడికల్ జర్నల్ తిరగేస్తూ ఆలోచిస్తున్నాను. తలుపులు మూసిన చప్పుడు. సన్నని అడుగుల సవ్వడి విని తలెత్తాను. ఎదురుగా సౌమ్య. తెల్లని వెంకటగిరి చీరలో, తలనిండా జాజులతో అద్భుతంగా ఉం దామె. ఎన్ని కలలు కన్నాను ఈ క్షణం కోసం! ఎన్ని క్షణాలు యుగాలై వేచి చూశాను! కానీ ... ఇప్పుడు వెచ్చని నిట్టూర్పుని అణచుకున్నాను.

"రా సౌమ్యా! అక్కడే ఆగిపోయా. వేం?" సాధ్యమైనంత మృదువుగా పిలిచాను.

మెల్లగా వచ్చింది సౌమ్య.



"కూర్చో."

తలవంచుకునే కూర్చుం దామె. కానీ ఆమె శరీరం కంపిస్తున్న విషయం గమనించాను.

"సౌమ్యా! ఒక్క ప్రశ్నకి జవాబు చెప్తావా?"

చప్పున కళ్ళెత్తి చూసి, బెదురుగా వాల్చేసుకుం దామె.

"నీలో ఊపిరి పోసుకుంటున్న బిడ్డకు తం డ్రెవరు?" సూటిగా అడిగేశాను.

ఒక్క క్షణం నిశ్శబ్దం. మరుక్షణం సౌమ్య కళ్ళు వర్షిస్తున్నాయి.

"ప్లీజ్! ఏడుపు దేనికీ పరిష్కారం కాదు. ఏడ్చేవాళ్ళంటే నా కసహ్యం కూడా. అస లేం జరిగింది? ను వ్వెవరి నైనా ప్రేమించావా? మీ డాడీ బలవంతంగా ఈ పెళ్ళి చేశారా? ప్లీజ్ సౌమ్యా! చెప్పు. మోసాన్ని నేను తట్టుకోలేను. కమాన్ టెల్ మీ!" ఎంత వద్దనుకున్నా కటువుగానే అన్నాను.

అయిదు నిముషాల తర్వాత దుఃఖాన్ని దిగమింగుతూ పెదవి విప్పింది సౌమ్య. "అతని పేరు సుధీర్. మాకు సీనియర్. అతనూ, నేనూ ప్రేమించుకున్నాం. మీ అంతస్తుకి తగను అని అత నన్నా నేను ఊరుకునేదాన్ని కాదు. సుధీర్ అందం, మంచితనం నన్ను ఆకట్టుకున్నాయి. ఎగ్జామ్స్ అవగానే నా ఫ్రెండుని డాడీకి చెప్పి ఫాక్టరీలోనే ఉద్యోగం ఇప్పించాను. నా చదువు పూర్తయ్యాక పెళ్ళి చేసుకుందా మనుకున్నాం. ఒకరోజు అనుకోకుండా జరిగిన సంఘటనలో నే నతనికి సొంత మయ్యాను. జరిగింది తప్పైతే అందులో నా ప్రమేయమూ ఉంది. అందుకే మా విషయం డాడీకి చెప్పాను" సౌమ్య ఆగింది.

"మీ డాడీ ఒప్పుకోలేదా?" నా గొంతు నాకే కొత్తగా ఉంది.

"ఒప్పుకున్నారు." ఆమె స్వరంలో అంతులేని అలజడి.

"మరి? సుధీర్ మోసం చేశాడా?" ఆత్రతగా అడిగాను.

"ఊహుఁ! తల్లిదండ్రుల్ని తీసుకొస్తున్న సుధీర్ బస్సు ఏక్సిడెంట్‌లో చనిపోయాడు." సౌమ్య దోసిట్లో ముఖం దాచుకుంది.

షాక్ తిన్నాను. మెదడులో ఏదో హోరు. ఆ హోరులో అస్పష్టంగా వినిపిస్తోంది.

"ఆ షాక్‌లో నుంచి తేరుకునేలోపే నాకు నెల తప్పిం దని తెలిసింది. డాడీ అబార్షన్ చేయిస్తా నన్నారు. కానీ నేను ఒప్పుకోలేదు. అయితే తన మాట విని తీరా లన్నారు డాడీ. మీతో పెళ్ళి ఖాయం చేశారు. నా కెటూ తోచలేదు. మిమ్మల్ని అన్యాయం చేస్తున్నా నేమో అనిపించేది. నా పరిస్థితి అంత మీకు చెప్పా లని రెండు సార్లు ఫోన్ చేశాను. కానీ మీరు కలవలేదు. మరోసారి చేస్తూ డాడీకి పట్టుబడ్డాను. నన్ను .... నన్ను అర్థం చేసుకోండి. మిమ్మల్ని మోసం చేయా లన్నది నా అభిమతం కాదు. నిస్సహాయస్థితిలో నేను ..." ఆ పైన చెప్పలేకపోయిన సౌమ్య హృదయ విదారకంగా రోదించసాగింది.

మౌనంగా లేచాను. చుట్టూ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సౌమ్య వెక్కిళ్ళు.

"సౌమ్యా! ప్లీజ్! ఊరుకో." బలవంతంగా ఓ గ్లాసు మంచినీళ్ళు పట్టి కన్నీళ్ళు తుడిచాను.

"టేక్ రెస్ట్!" ఆమెని వెనక్కి వడుకోబెట్టి. దుప్పటి కప్పాను. అంత చెప్పేశా నన్న రిలీఫ్‌తో నేమో సౌమ్య కళ్ళు మూతలు పడ్డాయి.

నేను బయటి కొచ్చాను. పుచ్చపువ్వు లాంటి వెన్నెల ఆ నిశీధిలో జాలిగా పలకరించింది. బాల్కనీలో చైర్ లాక్కుని కూర్చున్నాను. మన సంత వేదనగా ఉంది.

హఠాత్తుగా సౌమ్యని తొలిసారి చూసిన క్షణం గుర్తొచ్చింది. ముగ్ధంగా ఉన్న ఆ పసిడిబొమ్మ మూడు నెలల కాలంలో ఎన్ని చేదు అనుభవాలను చవి చూసింది!

ఇప్పుడు ... ఇప్పుడు నే నేం చేయాలి? ఎలా ఈ సమస్యని పరిష్కరించాలి? ఇలా అని తెలిస్తే అమ్మా, నాన్నా తట్టుకోగలరా? అలా అని నేను దాచినా దాగని సౌమ్య రూపం అందరికీ తెలియపరిస్తే, ఈ ఇంటి పరువూ, ప్రతిష్ఠా ఏమవుత యి?

నా తల తిరిగిపోతోంది. భగవంతుడా! ఎందు కీ సమస్యని సృష్టించావు?

ఆలోచనలతో రాత్రి కరిగిపోతోంది. నిజానికి ఈ విషయం అందరికీ తెలిస్తే నాకే మద్దతు నిస్తారు. కానీ పదిమందిలోనూ సౌమ్య దోషిగా నిలబడుతుంది. నాకు డైవోర్స్ రావచ్చు. కానీ ... కానీ అందువల్ల ఒరిగే దేమిటి? సౌమ్యని పతితగా ఈ లోకంలో ... నో! ఎక్కడో ఏదో కదులుతోంది. జరిగిన దాంట్లో ఆమె త ప్పేమిటి?

వెచ్చని ఎండ చెంపలని త కుతుంటే బద్ధకంగా లేచాను. అప్పుడు గుర్తొచ్చింది హాస్పిటల్‌కి త్వరగా వెళ్ళా లని. హడావుడిగా తయారై సౌమ్య వైపు చూశాను. దిగులుగా, ఆ మంచం మీదే కూర్చుని ఉంది. నాకు జాలేసింది.

"గీజర్ ఆన్ చేశాను సౌమ్యా! లేచి స్నానం చెయ్యి" మృదువుగా చెప్పాను.

నమ్మలేనట్టు చూసిం దామె నా వైపు.

"జరిగిన దాని కంటే జరగాల్సిన దాని గురించి ఆలోచించడం ముఖ్యం. లే! నాకు టైమైంది వెళ్తున్నాను."

నేను హాస్పిటల్‌కి వెళ్ళిపోయాను. ఒక మేజర్ ఆపరేషన్ చేసిన పేషంట్‌కి సూచర్స్ విప్పదీసి డిశ్చార్జి చేయాలి. అసిస్టెంట్ డాక్టర్ ప్రియని ఓ.పి. చూడ మని నేను ఆ పేషెంట్‌ని అటెం డయ్యాను. సూచర్స్ తీసి, బాండేజి వేసి ఇవతలకి వచ్చేసరికి ముప్పావుగంట పట్టింది. డిశ్చార్జ్ చేస్తూ, ప్రియ లేకపోవడం గమనించి సిస్టర్‌ని పిలిచాను.

"మీ మిసెస్‌కి బావుండలేదుట సార్! ఫోన్ చేస్తే వెళ్ళారు!"

నా చేతిలో పెన్ జారిపోయింది. ఇప్పుడు ప్రియ నిజం చెప్తే? గబాల్న లేచి నా స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళాను. సరిగ్గా నే నూహించినదే జరుగుతోం దక్కడ. అపరాధిలా నిలబడి దిక్కులు చూస్తున్న ప్రియ నన్ను చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

"చూశావట్రా! ఈ ఘోరం? సౌమ్య గర్భవతట! మన నెంత మోసం చేశారు!" ఆవేశంగా అంటున్న అమ్మని ఆపాను.

"లే దమ్మా! ఎవరూ 'మనని మోసం చేయలేదు. ఆ బిడ్డకి తండ్రిని నేనే!"

"అభీ!" తెల్లబోయింది అమ్మ.

"అవు నమ్మా! సౌమ్య నాకు ముందే తెలుసు. అనుకోకుండా ఆమె, నేనూ ఒకటయ్యాం. అందుకే త్వరపడి వాళ్ళ నాన్నగారిని పంపించింది సౌమ్య. నేను తండ్రి నౌతున్నా నని నాకూ నిన్నే తెలిసింది. మీతో తీరిగ్గా చెబుదామని ఉదయం వెళ్ళిపోయాను."

"మరి ఒక్కసారైనా సౌమ్యా, నువ్వూ ప్రేమించుకున్నా రని చెప్పలేదు."

నేను నవ్వాను. "ఫొటో చూపించినప్పుడే చెప్పాను కదమ్మా! ఆ అమ్మాయి నాకు తెలుసని."

ఎన్నడూ అబద్ధం ఆడని నన్ను అందరూ తేలిగ్గా నమ్ముతా రని తెలుసు.

"ఛ! కన్నీ ళ్ళెందు కమ్మా? ఇంత శుభవార్తకి సంతోషించాలి గానీ!"

అమ్మ మాటలు విని హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

ఆ రాత్రి పదిన్నరికి గదిలో అడుగుపెట్టిన నన్ను సౌమ్య ప్రశ్నించింది - "ఎందు కిలా చేశారు?" అని.

"ఎలా?" చిరునవ్వుతో అడిగాను.

సౌమ్య నా దగ్గర కొచ్చింది. నా చేతులు పట్టుకుంటూ అంది - "వద్దండీ! త్యాగాని క్కూడా ఓ హద్దుంటుంది. నా కోసం చేయని తప్పుని చేశా నంటున్నారు. ఇంత సహృదయత్వాన్ని భరించలేను. నిజాన్ని అందరికీ చెప్పండి. మీరు మరో పెళ్ళి చేసుకోండి. ఏ దూరప్రదేశానికో వెళ్ళి నా బిడ్డని పెంచుకుంటాను. ప్లీజ్!"

"సౌమ్యా! ఇటు చూడు. డోంట్ గెట్ ఎక్సయిటెడ్. ప్రశాంతంగా ఆలోచించు. సుధీర్‌తో నీ పెళ్ళికి మీ డాడీ అడ్డుపడితే, ఆయనకి నచ్చచెప్పి ఇద్దరినీ కలిపేవాడిని. అలా కాక సుధీర్ మోసం చేస్తే ఎక్కడున్నా వెతికి నీ వాడిని చేసేవాడిని. ఈ రెండూ జరగలేదు. విధి చేసిన నేరానికి ను వ్వెందుకు బలవ్వాలి? అందుకే ఈ నిర్ణయం. తొందరపడటం తప్పే కావచ్చు. కానీ ఇలా ఊహించలేముగా?"

సౌమ్య కళ్ళు విప్పార్చి నా వంకే చూస్తోంది.

"సౌమ్యా! నిన్ను చూసిన క్షణం నుంచి ఎన్నో కలలు కన్నాను. నా భార్యగా, ఇల్లాలుగా నీతో ఎన్నో ఆశల పొదరిల్లు కట్టుకున్నాను. ఇప్పు డవన్నీ మరిచిపోయి మరొకరికి భర్తని కాలేను. అందుకే నీ బిడ్డకి నేను తండ్రి నవుతాను. సుధీర్‌ని మరిచిపోవడం కష్టమే అయినా ప్రయత్నించగలవని నమ్ముతున్నాను. గతాన్ని ఓ తీయని జ్ఞాపకంగా మిగుల్చుకో! భవిష్యత్తుని అందంగా అనుభవించు. ఓ.కే!" ఆర్ద్రంగా అన్నాను.

సౌమ్య ఏం మాట్లాడలేదు. చెప్పా లనుకున్నవన్నీ చెలియలి కట్ట దాటితే మిగిలే స్వచ్ఛమైన శూన్యంలో, కన్నీటి తెరలతో నా పాదాలు తా కింది. ఆప్యాయంగా ఆమెని లేపి, మృదువుగా కన్నీళ్ళు తుడిచాను. నా గుండెలో తలదాచుకున్న సౌమ్యని ఆత్మీయంగా చుట్టేశాను. పుడమి చుట్టూ అల్లుకుంటున్న వెన్నెల అహ్లాదంగా మా ఇద్దర్నీ చుట్టుముడుతోంది. ★

